సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 10 । మార్చి । 2023



కంటివెలుగు పరీక్షలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 36వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్ కృష్ణ పాల్గొన్నారు.



రాజన్న సేవలో ఏఎస్పీ

వేములవాడఅర్బన్: రాజన్నను అడిషనల్ ఎస్పీ చంద్రయ్య గురువారం దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సృజనాత్మకతకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నవీన్

సిరిసిల్లకల్చరల్: వ్యవసాయ రంగంలో ఉపకరించే పరికరాలను సులభ శైలిలో రూపొందించే శ్రీరాముల నవీన్‌కు సాంకేతిక, సృజనాత్మక రంగాల్లో కృషి చేస్తున్నందుకు గుర్తింపు లభించింది. ఏషియన్ వేదిక్ కల్చరల్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కార్యక్రమం నిర్వహించారు.

కిరాణం దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేట, కట్టలింగంపేటల్లోని కిరాణం దుకాణాలపై ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం దాడులు చేశారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పట్టుకుని, నాలుగు దుకాణాల నిర్వాహకులకు రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు లింగమూర్తి, అనిల్ ఉన్నారు.

ఎస్బీ సీఐగా కరుణాకర్



సిరిసిల్లక్రైం: పోలీసుశాఖలోని సీఐలను బదిలీ చేస్తూ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం కమిషనరేట్‌లో ఐటీ విభాగంలో పనిచేస్తున్న పెరుక కరుణాకర్‌ను సిరిసిల్ల ఎస్బీ సీఐగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు సిరిసిల్ల ఎస్బీ సీఐగా పనిచేసిన సర్వర్‌ను ఐజీపీ హైదరాబాద్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



గొల్లపల్లిలో పరిశీలిస్తున్న డీఈవో

గంభీరావుపేట(సిరిసిల్ల): పదోతరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ కోరారు. కేజీ టు పీజీ క్యాంపస్‌లోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీలను డీఈవో గురువారం సందర్శించారు. పదోతరగతి విద్యార్థుల చదువు, సామర్థ్యాన్ని ప్రగతిని పరిశీలించారు. పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎం బాల ఎల్లయ్య, గంగారాం, వసంత ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ కోరారు. మండలంలోని గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది పరీక్షలు దగ్గరలోనే ఉన్నాయని, సాయంత్రం ప్రత్యేక తరగతులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి బోధించాలని సూచించారు. సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కోనరావుపేట(వేములవాడ): మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. కోనరావుపేట మండలపరిషత్‌లో ఉషోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. మండలంలో 858 సంఘాలకు 2018 నుంచి 2020 వరకు రూ.1.32 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచ్ పోకల రేఖ, ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, ఎంపీటీసీ చారి, ఎంపీడీవో రామకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు జంగం రజిత, నల్ల రుచిత, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన మిర్చి



మిర్చి బస్తాతో ఉన్న ఇతని పేరు వట్టిమల్ల శంకరయ్య. చందుర్తి మండలం మూడపల్లి. ఎకరం భూమిలో మిర్చిపంటను వేశాడు. తెగుళ్లు ఆశించడంతో దిగుబడి తగ్గింది. ఎకరానికి కనీసం పది క్వింటాళ్ల మిర్చి పండాల్సి ఉండగా.. ఐదు క్వింటాళ్లకు పడిపోయింది. ఆ కొద్దిపాటి మిర్చిని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నాడు.



రుద్రంగికి చెందిన మర్చి రైతు లక్ష్మి సిరిసిల్ల గాంధీచౌక్‌లో కిలోకు రూ.250 చొప్పున తోట మిరపకాయలను విక్రయిస్తుంది. ఐదు ఎకరాల్లో పంట సాగు చేసింది. మార్కెటింగ్ వసతి లేక ఊరూరు తిరిగి విక్రయిస్తుంది.



తిప్పాపూర్ వద్ద ఆరబెట్టిన మిర్చి పంట

- తగ్గిన దిగుబడితో రైతులకు దక్కని లాభం
- మార్కెటింగ్ వసతి లేక తిప్పలు
- ఊళ్లలో తిరుగుతూ విక్రయాలు
- జిల్లాల్లో 2,500 ఎకరాల్లో మిర్చి సాగు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 2,500 ఎకరాల్లో మిర్చిని సాగుచేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ తోట మిర్చి, నల్లరేగడి నేలల్లో కారంమిర్చిని వేశారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, చీడపీడల బెడదతో దిగుబడి సగానికి పడిపోయింది. మార్కెట్‌లో మిర్చి ధర క్వింటాల్‌కు నాణ్యతను బట్టి రూ.15 వేల నుంచి రూ.25వేలు ఉండగా.. దిగుబడి లేక రైతుల ఆశలు ఆవిరయ్యాయి. జిల్లాలోని రుద్రంగి, చందుర్తి, ఇల్లంతకుంట, కోనరావుపేట మండలాల్లో ఎక్కువగా మిర్చి పంటను వేశారు. దిగుబడి తగ్గినా ఉన్న మిర్చి పంటను అమ్ముకుందామంటే జిల్లాలో మార్కెట్ వసతి లేదు. వరంగల్, నిజామాబాద్ జిల్లాలకు వెళ్లి అమ్ముకోవాలి. జిల్లాలో కోల్డ్‌స్టోరేజీ గోదాములు ఒక్కటి కూడా లేదు. పెద్ద రైతులు మాత్రం రవాణా ఖర్చులు భరించి ఆంధ్రా ప్రాంతానికి తరలించి మిర్చిని అమ్ముకుంటున్నారు.

వీధుల్లో బేరాలు

జిల్లాలోని మిర్చి రైతులు మార్కెటింగ్ వసతి లేక, కోల్డ్‌స్టోరేజీ గోదాములు అందుబాటులో లేక విడిగానే వీధుల్లో విక్రయిస్తున్నారు. తోట మిర్చి(నాణ్యమైంది) కిలో ధర రూ.300 అమ్ముతుండగా.. నాసిరకం మిరపకాయలను రూ.200 కిలో ఇస్తున్నారు. తాలు ఉన్న మిరపకాయలను రూ.150 కిలో అమ్ముతున్నారు. మిర్చి పంటను ఏరేందుకు కూలి ఒక్కరికి రూ.400లకు చేరడంతో పెట్టుబడులు పెరిగిపోయాయి. తోట మిర్చిని కొందరు రైతులు సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, రుద్రంగి, బోయినపల్లి మండల కేంద్రాల్లో విడిగానే విక్రయిస్తున్నారు.

మార్కెటింగ్ వసతి కల్పిస్తే..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో మిర్చి అమ్ముకునేందుకు మార్కెటింగ్ వసతి కల్పిస్తే.. జిల్లాలో మిర్చి రైతులకు నమ్మకంగా గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది. కోల్డ్ స్టోరేజీ ఏసీ గోదాములను నిర్మిస్తే పంటను నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మిర్చి రైతుల ప్రయోజనం కోసం మార్కెటింగ్ వసతి, గోదాములను అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.



ఇతను చందుర్తి మండలం మూడపల్లికి చెందిన నరేశ్. ఎకరంన్నరలో మిర్చి సాగుచేశాడు. దాదాపు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాలుకు కాయల నాణ్యతను బట్టి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంది. ధర ఉన్నప్పటికీ దిగుబడి లేక మిర్చి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

నాడు తెలంగాణ నినాదం.. నేడు ఛత్తీస్‌గఢ్ విధానం

- అంబేడ్కర్ స్టేడియం సభ చారిత్రకం అవుతుందని ఆకాంక్ష
- కాంగ్రెస్ కవాతు సభతో పార్టీ శ్రేణుల్లో జోష్
- కవాతుకు కదంతొక్కిన అభిమానులు
- హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు తరలివచ్చిన జనం
- కరీంనగర్ పవిత్ర స్థలమంటూ కొనియాడిన రేవంత్‌రెడ్డి
- యాత్ర ఫర్ చేంజ్ ఇక్కడి నుంచే ప్రారంభమన్న నేతలు
- బైబై కేసీఆర్ అంటూ సభా ప్రాంగణంలో ప్లకార్డుల ప్రదర్శన



కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, వేదికపై కాంగ్రెస్ పార్టీ నాయకులు



పాదయాత్రగా వస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: 2004 మార్చిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తామంటూ అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హామీ ఇచ్చిన అదే అంబేడ్కర్ స్టేడియం మరోసారి కాంగ్రెస్ నేతల వాగ్దానాలకు వేదికైంది. గతంలో ఇక్కడే ఇచ్చిన మాట ప్రకారం.. తెలంగాణ ఏర్పాటు చేసినట్లే.. ఈసారి తాము అధికారంలోకి వస్తే.. రైతు, నిరుద్యోగుల అభ్యున్నతికి పాటుపడేలా ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు ముక్తకంఠంతో హామీలిచ్చారు. చరిత్ర పునరావృతమవుతుందని, ఈ సభ చారిత్రకమవుతుందని కాంగ్రెస్ నేతలు ఆకాంక్షిస్తున్నారు. హాథ్ సే హాథ్ జోడో–యాత్ర ఫర్ చేంజ్‌లో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. బైపాస్ రోడ్‌లో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ స్టేడియం వరకు సాగిన పాదయాత్రకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. పాదయాత్ర ఆసాంతం రేవంత్‌రెడ్డి జనానికి అభివాదం చేస్తూ పలకరించుకుంటూ కొనసాగించారు. స్టేడియంలో కరీంనగర్ కవాతు పేరుతో నిర్వహించిన బహిరంగసభకు వేలాదిగా జనం తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ప్రాంతంలో ఒక గొప్ప పవిత్ర స్థలం ఉంటుందని, కరీంనగర్‌లో అలాంటి గొప్ప పవిత్ర స్థలం అంబేడ్కర్ స్టేడియం అంటూ కొనియాడారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను గౌరవించి 2004లో ఇదే గడ్డపై తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ మాట ఇచ్చారన్నారు. తెలంగాణ సాక్షాత్కారం కావడంతో స్టేడియం తెలంగాణ తెచ్చిన పవిత్ర స్థలంగా మారిందన్నారు. వేములవాడ, కొండగట్టు పుణ్య క్షేత్రాలకు ఎంత ప్రాధాన్యత ఉందో.. ఈ స్టేడియంకు అంతే ఉందని అన్నారు. 'మాట తప్పక మడమ తిప్పక.. సోనియా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు. కానీ ఇచ్చిన రాష్ట్రం ఇవాళ ఎవరిపాలైందో మీరు ఆలోచన చేయండి' అంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తల్లిని చంపి పిల్లను బతికించారని మోదీ అవహేళన చేశారని, తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేని బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఇక్కడ గెలిచిన బండి సంజయ్ కూడా కరీంనగర్‌కు ఏం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, వి.హన్మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యేలు వంశీ చందు, కొండా సురేఖ, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, అంజన్‌కుమార్, పద్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేలా మాట్లాడుతూ.. కరీంనగర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కరీంనగర్ గుర్తుకు వస్తుందన్నారు. తాము రైతు సంక్షేమానికి, గ్రామీణ వికాసానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వస్తే.. ఉపాధి అవకాశాలు వస్తాయని యువత పెట్టుకున్న ఆశలను బీఆర్ఎస్ నెరవేర్చలేదని విమర్శించారు.
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ప్రజలను నిండా ముంచారన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని పాలించే అర్హత కోల్పోయారని, కేసీఆర్‌ను రాజకీయ ఉరికంభం ఎక్కించబోయేది కరీంనగర్ కావాలని ఆకాంక్షించారు.
- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో పాలన సాగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని కోరారు. కేసీఆర్ హామీలన్నీ మరిచారని, కాంగ్రెస్ వస్తే నిరుద్యోగ భృతి, వరికి మద్దతు ధరతోపాటు బోనస్ ఇస్తామని స్పష్టం చేశారు.

మంత్రి గంగులపై చార్జిషీట్

అంతకుముందు మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి స్థానిక మంత్రి గంగుల కమలాకర్‌పై చార్జిషీట్ విడుదల చేశారు. భూఆక్రమణలు, మైనింగ్, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు.

వైభవంగా ఉత్సవాలు షురూ..



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే శివకల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కల్యాణమహోత్సవానికి ఆచార్య దంపతులుగా గోపన్నగారి వసంత్, సరిత వ్యవహరించారు. ఉదయం స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు ఈశ్వరగారి సురేశ్, ఉపప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. 110 మంది బ్రాహ్మణులకు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ దీక్షా వస్త్రాలు అందజేసి, వర్ణి ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు అద్దాల మంటపంలో అష్టావధాని త్రిగుళ్ల శ్రీహరిశర్మ శివపురాణ ప్రవచనం, రాత్రి 7 గంటల నుంచి భేరిపూజ నిర్వహించారు. అనంతరం జంగమయ్యలకు వర్ణి ఇచ్చారు. శుక్రవారం ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు.

ఘనంగా భేరిపూజ

శివకల్యాణం మహోత్సవాల సందర్భంగా రాత్రి ఆలయ అర్చకులు అద్దాల మండపంలో భేరిపూజ నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో వస్తుహోమం జరిపారు.



ఆలయంలోని యాగశాల



భేరి పూజ చేస్తున్న అర్చకులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: జిల్లాలో మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం చైర్‌పర్సన్ అరుణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్న వారు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తారని, సర్కారు ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించి, ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచాలన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ఇంటింటి జ్వరసర్వేలు చేస్తూ.. మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సేవలందేలా చూస్తున్నారన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయమని అరుణ స్పష్టం చేశారు. జిల్లా ఆస్పత్రికి ఆధునిక పరికరాలు సమకూర్చి, వైద్యుల కొరత లేకుండా మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నారన్నారు. హైదరాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోనే నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వసతులు కల్పిస్తున్నామని అరుణ వివరించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి అనారోగ్యంతో వచ్చే వారికి వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా ఆస్పత్రిపై ఇప్పటికే ప్రజల్లో నమ్మకం పెరిగిందని, మరింత పెరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ కోరారు. వసతుల కల్పన, కొత్త నిర్మాణాలపై సమీక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గట్ల మీనయ్య, గుగులోత్ కళావతి, వైద్యులు పి.రఘు, తిరుపతి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా రుణ ప్రణాళిక రూ.2,834.34 కోట్లు

- పంట రుణాలు రూ.1,401.85 కోట్లు
- బ్యాంకర్లు రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



రుణప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా 2023–2024 వార్షిక రుణ ప్రణాళిక రూ.2,834.34 కోట్లుగా నిర్ణయించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ బ్యాంకర్లు ప్రాధాన్యత రంగాలకు రుణాలు అందించాలని కోరారు. పాడిగేదెల పథకంలో 1,120 మంది దరఖాస్తులు చేసుకోగా 602 మందికి మాత్రమే రుణాలు ఇచ్చేందుకు సమ్మతం తెలిపారని, ఇంకా 880 మంది ఎస్సీ దరఖాస్తుదారులకు అవకాశం ఉందన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి బ్యాంకర్లు సమ్మతం తెలపాలన్నారు. నాబార్డు పెటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌లో 2023–2024 వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. పంట రుణాలకు రూ.1,401.85 కోట్లు, టర్మ్ రుణాలుగా రూ.1,763.13 కోట్లు, ఎమ్మెస్ ఎంఈలకు రూ.640.75 కోట్లు కేటాయించామని బ్యాంకర్లు వివరించారు. పట్టణ స్వయం సహాయ సంఘాలకు 145 శాతం రుణాలు ఇవ్వడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ మహిళలకూ రుణాలు విరివిగా అందించాలని సూచించారు. వ్యవసాయ మౌలిక వసతుల నిధి పథకంలో వచ్చే దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల లక్ష్యం రూ.2,725 కోట్లు కాగా, ఇప్పటికే బ్యాంకర్లు రూ.1,850 కోట్లు మంజూరు చేశారని వివరించారు. యూబీఐ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ టి.వంశీకృష్ణ, ఆర్‌బీఐ ఎల్‌డీవో రాజేంద్రప్రసాద్, నాబార్డు డీడీఎం పి.మనోహర్, ఎస్‌బీఐ ఆర్ఎం రవిశేఖర్, టీజీబీ ఆర్ఎం బి.గంగాధర్, కేడీసీసీబీ సీఈవో ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

భోజనం ఎలా ఉంది చిన్నా ?



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): 'మధ్యాహ్న భోజనం ఎలా ఉంది చిన్నా..' అని విద్యార్థులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆరా తీశారు. మండలంలోని వెంకటాపూర్, దుమాల గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని మన ఊరు మన బడి పనులను గురువారం తనిఖీ చేసిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. చక్కగా చదివి ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, ఎంఈవో రఘుపతి ఉన్నారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో బయోవేస్ట్‌ను పడేయొద్దు

- మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య



మాట్లాడుతున్న కమిషనర్ సమ్మయ్య

సిరిసిల్లటౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీలు బయోవేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో పడేయొద్దని, సాంకేతిక పద్ధతులతో నిర్మూలించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సూచించారు. స్థానిక నెహ్రూనగర్‌లోని ఆర్‌ఎంపీ భవన్‌లో గురువారం ఆర్‌ఎంపీ, పీఎంపీలతో సమావేశమయ్యారు. బయట పడేస్తున్న బయోవేస్ట్‌ను తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంసీ అసోసియేషన్ అధ్యక్షుడు కుడిక్యాల రవి, అల్వాల ఈశ్వర్, రాజమల్లు, బోగ వెంకటేశ్వర్లు, రవీందర్, అశోక్, దేవదాస్, మిట్టపల్లి రాజమల్లు ఉన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న శిక్షణాధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉపాధిహామీ పనులు ఎలా ఉన్నాయి.. రోజుకు ఎంత కూలీ వస్తుంది.. అంటూ సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు ఉపాధిహామీ కూలీలతో ముచ్చటించారు. మండలంలోని నామాపూర్‌లో గురువారం క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఎంతసేపు పని చేస్తున్నా రు, పని ప్రదేశాల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. సివిల్ సర్వీసెస్ అధికారులు అభిషేక్, సారభ్‌కాంత్, అన్‌మోల్, అమిత్‌కుమార్, భావన మిశ్రా, ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్ విజయ, కా ర్యదర్శి సౌజన్య, ఏపీవో ఆనంద్ మోహన్ ఉన్నారు.

వేములవాడరూరల్: సివిల్ సర్వీసెస్ శిక్షణాధికారులు మండలంలోని మర్రిపల్లిలోని అభివృద్ధి పనుల ను పరిశీలించారు. రైతువేదికలో రైతులతో సమావేశమయ్యారు. రైతుల సమస్యలు, జీవనవిధానం గురించి తెలుసుకున్నారు. ఎంపీపీ బండ మల్లేశం, జెడ్పీటీసీ ఏశ వాణి, సర్పంచులు కట్కం మల్లేశం, సుమన్, ఏవో సాయిచరణ్, ఏఈవో సందీప్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఐదోరోజు శిక్షణలో భాగంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. లక్ష్యం చేరుకునేందుకు పట్టుదలతో చదువాలన్నారు. ఎంపీడీవో చిరంజీవి, సర్పంచ్ ముక్క శంకర్, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

15లోపు ఉగాది కవితలు పంపండి

సిరిసిల్లకల్చరల్: ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించే కవిసమ్మేళనంలో పాల్గొనే కవులు తమ కవితలను ఈనెల 15లోపు పంపించాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి ప్రకటనలో తెలిపారు. సామాజిక ఇతివృత్తంతో కవితలను ఇరువై పంక్తులకు మించకుండా పంపించాలని పేర్కొన్నారు. వివరాలకు 98487 70345లో సంప్రదించాలని కోరారు.

'గోరుముద్ద'తో తీరెను చింత..



అల్పాహారం తింటున్న టెన్త్ విద్యార్థులు

- అల్పాహారంతో 'పది' విద్యార్థులకు లబ్ధి
- జిల్లాకు చేరిన నిధులు
- మొదట జిల్లాలోనే అమలు
- సత్ఫలితాలు సాధించడమే లక్ష్యం

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న అల్పాహార కార్యక్రమానికి సిరిసిల్ల జిల్లా నాంది పలికింది. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పడిన సిరిసిల్లలో అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్, జాయింట్ కలెక్టర్ ప్రోత్సాహంతో గోరుముద్ద పేరిట పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో అల్పాహారం అందించేందుకు బాటలు వేశారు. గత విద్యాసంవత్సరం నుంచి అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను జిల్లా విద్యాధికారి ద్వారా ఉపాధ్యాయులు వినతులు అందజేశారు. కాగా ప్రభుత్వమే అల్పాహారం అందించేందుకు నిధులు కేటాయిస్తోంది.

• ప్రతి విద్యార్థికి రూ.15

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఏ అల్పాహారం అందించాలన్న దానిపై ప్రభుత్వం మెనూ కేటా యించింది. ప్రతీ విద్యార్థికి రూ.15 అందిస్తూ సంబంధిత పాఠశాలకు నిధులను విడుదల చేసింది. దీంతో గత నెల 16 నుంచి విద్యార్థికి అల్పాహారం అందిస్తున్నారు. గతంలో మాదిరిగా దాతలసాయం కోరా ల్సిన అవసరం ఉండదని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

• అభ్యాసనకు మార్గదర్శకాలేవీ.?

ఇన్నిరోజులు విద్యార్థులకు ఆహారం అందడం లేదని ప్రత్యేక తరగతుల్లో హాజరు తక్కువగా ఉంటుందనే సమస్య నిధులు కేటాయింపుతో తీరిపోయింది. కానీ పదో తరగతి విద్యార్థులకు మారిన పరీక్ష విధానానికి అనుగుణంగా మాదిరి ప్రశ్నపత్రాలను జిల్లా పరీక్ష బోర్డు నుంచి అందిస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు మాదిరి ప్రశ్నపత్రాలను పీడీఎఫ్ రూ పంలో అందిస్తామని గతంలో డీఈవోగా పనిచేసిన రాధాకిషన్ హామీఇచ్చారు. కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. అన్ని సమకూర్చితే సత్ఫలితాల సాధనపై దృష్టిసారిస్తామని ప్రత్యేక తరగతుల ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

అల్పాహారం మెనూ రోజువారీగా..

సోమవారం	ఉడికించిన మంచి శనిగలు, అరటిపండు
మంగళవారం	అటుకుల చుడువ, అరటిపండు
బుధవారం	వేయించిన పల్లీలు,, బెల్లం, అరటిపండు
గురువారం	రెండు గుడ్లు, అరటిపండు
శుక్రవారం	సమోసాలు, పకోడి లేదా బిస్కెట్ అరటిపండు
శనివారం	ఉడికించిన పల్లీలు, అరటిపండు

మండలం	విద్యార్థులు	విడుదలైన నిధులు
బోయినపల్లి	180	98,000
చందుర్తి	183	93,330
ఇల్లంతకుంట	290	1,47,900
గంభీరావుపేట	388	1,97,880
కోనరావుపేట	321	1,63,710
ముస్తాబాద్	349	1,77,990
రుద్రంగి	89	45,390
సిరిసిల్ల	588	2,99,880
తంగళ్లపల్లి	304	1,55,040
వీర్నపల్లి	118	60,180
వేములవాడ	257	1,31,070
వేములవాడ రూరల్	125	63,750
ఎల్లారెడ్డిపేట	387	1,97,370

మెనూ ప్రకారం అల్పాహారం



సాయంత్రం 4 గంటల తర్వాత రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆకలిగా ఉన్న సమయంలో మెనూ ప్రకారం అల్పాహారం అందిస్తున్నారు. దీంతో ప్రత్యేక తరగతుల సమయంలో ఉత్సాహంగా చదువుతున్నాం. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తా.

– మంచికట్ల హర్షిత, టెన్త్ విద్యార్థిని, సిరిసిల్ల

జిల్లాను ప్రథమస్థానంలో నిలుపుతాం..



అల్పాహారం అందించే విషయంలో పర్యవేక్షణ కొనసాగుతుంది. ప్రభుత్వం అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలి. అల్పాహారం, పంపిణీ, ప్రత్యేక తరగతుల నిర్వహణలో రాష్ట్ర బృందం పర్యవేక్షణ చేస్తోంది. పది ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తాం.

– రమేశ్‌కుమార్, డీఈవో

మంటల్లో కాలిపోయిన మూడు కార్లు

- సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- రూ.68లక్షల నష్టమన్న బాధితుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య
- షార్ట్ సర్క్యూట్ కారణమా..?



మంటల్లో కాలుతున్న కార్లు.. ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్యకు చెందిన మూడు కార్లు గురువారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. పట్టణంలోని సాగర్‌రోడ్డులోని షెడ్డులో కార్లను మూడు రోజుల క్రితం పార్కింగ్ చేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని, కారును సర్వీసింగ్ చేయించాలని రాజయ్య చెప్పడంతో డ్రైవర్ యూసుఫ్‌కారును స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చిందని, రెప్పపాటులోనే మంటలు చెలరేగాయని డ్రైవర్ వివరించాడు. ఆ పక్కనే రాజయ్యకు చెందిన మరో రెండుకార్లు కూడా పార్కింగ్ చేసి ఉండగా వాటికీ మంటలు వ్యాపించి అవికూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో కాలిన మూడు కార్ల విలువ రూ.68లక్షల వరకు ఉంటుందని రాజయ్య ఫిర్యాదుతో విచారణ చేస్తున్నామని అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. కియాకారు (రూ.26 లక్షలు) ఇన్నోవా కారు (రూ.24లక్షలు), క్రెటా కారు (రూ.18లక్షలు) నష్టం వాటిల్లిందని పేర్కొన్నట్లు వివరించారు. ఘటనా స్థలాన్ని సీఐలు ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్ సందర్శించారు.

విచ్చలవిడిగా వన్యప్రాణుల వధ



తడగొండ -మల్యాపూర్ దారిలో బహిరంగంగా అడవిమాంసం విక్రయం



చనిపోయిన అడవిపందులు

- బహిరంగంగా మాంసం విక్రయాలు
- జగిత్యాల జిల్లా నల్లగొండ నుంచి రవాణా
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

బోయినపల్లి: (చొప్పదండి) : మండలంలో వన్యప్రాణుల మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అడవి పందులు, దుప్పులు తదితర మాంసాన్ని బహిరంగంగానే విక్రయాలు జరుపుతున్నారు. వేటాడిన అడవి జంతువులను జగిత్యాల జిల్లా నల్లగొండ, తిప్పాయిపల్లి తదితర గ్రామాల నుంచి మండలంలోని మల్యాపూర్ తడగొండ, అనంతపల్లి, కోరెంతో పాటు పలు గ్రామాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈనెల 4న తడగొండ నుంచి మల్యాపూర్ వెళ్లే దారిలో దుర్గమ్మ గుడి పరిసరాల్లో అడవి పందుల మాంసం విక్రయాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

బైక్‌పైనే రవాణా..

కొడిమ్యాల మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి కొందరు అడవి జంతువులను వేటాడి బైక్ పైనే గ్రామాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఒక్కోసారి రెండు నుంచి మూడు అడవి జంతువులను విక్రయించిన దాఖలాలున్నాయి.

కొన్నినెలల నుంచి యథేచ్ఛగా..

వేటాడిన అడవి జంతువుల మాంసాన్ని బహిరంగంగానే విక్రయిస్తున్నారు. తడగొండలో ఇటీవల నల్లగొండకు చెందినవారు మూడు అడవి పందులను బైక్‌పై తీసుకువచ్చి దుర్గమ్మ ఆలయ పరిసరాల్లో వాటిని కోయడం వివాదస్పదమైంది. ఒక మాంసం కుప్పకు రూ.200 చొప్పున విక్రయించారు. మల్యాపూర్‌లో సైతం ఇలాంటి మాంసం విక్రయాలు జరుగుతాయని తెలిసింది. మండలంలో కొన్నినెలలుగా మాంసం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వణ్యప్రాణుల వధ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టుబడిన పగటి దొంగ

- రూ.1.20 కోట్ల సొత్తుచోరీ
- పోలీసులకు చిక్కిన వెంకటేశ్
- నాలుగేళ్లుగా దొంగతనాలు
- చోరీ సొత్తుతో ఆన్‌లైన్ గేమింగ్
- మణుగూరులో ఇళ్లు కొనుగోలు



పట్టుబడిన నిందితుడితో సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ, అధికారులు

గోదావరిఖని: నాలుగేళ్లుగా వరుస చోరీలకు పాల్పడిన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. 72 దొంగతనాల్లో రూ.1.20 కోట్ల సొత్తు చోరీకి పాల్పడ్డాడు. 2.89కిలోల బంగారం, 4.07 కిలోల వెండి, రూ.19లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. చివరకు గురువారం పోలీసులకు చిక్కాడు.. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి చోరీ వివరాలు వెల్లడించారు. సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు జిల్లా తక్కళ్లపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన రాజవరపు వెంకటేశ్(28) కొన్నేళ్ల క్రితం మంచిర్యాల జిల్లాకు వచ్చాడు. శ్రీరాంపూర్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని సీసీ నస్పూర్ షిర్కేకాలనీ క్వార్టర్ 1145లో నివసిస్తున్నాడు. 2019లో మొదటి సారి చోరీకి పాల్పడిన వెంకటేశ్ ఇప్పటివరకు 72 చోరీలకు పాల్పడినట్లు సీపీ వివరించారు. చోరీలకు పాల్పడగా వచ్చిన సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వినియోగించినట్లు వివరించారు. అంతేకాకుండా దొంగిలించిన ఆభరణాలను ముత్తూట్, శ్రీరాంఫైనాన్స్‌లో కొంత తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో మణుగూరులో ఇళ్లు కొనుగోలు చేసినట్లు వివరాలు వెల్లడించారు. పెద్దమొత్తంలో దఫాబెట్ కోసం వెచ్చించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ ఫ్లైట్‌మోడ్.. పట్టపగలే చోరీలు

చోరీచేసే ప్రాంతాన్ని ఎంచుకుని ఉదయమే సెల్‌ఫోన్ ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకుని బైక్ లేదా కారులో వెళ్తూ చోరీలకు పాల్పడుతుండేవాడు. రాత్రిళ్లు పోలీస్ పెట్రోలింగ్ ఉంటుందన్న భయంతో పగలే ఇళ్లకు కన్నం వేస్తుండేవాడు. ఇలా ఇంట్లో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారికి అనుమానం రాకుండా చోరీలకు పాల్పడినట్లు సీపీ వివరించారు. అయితే మధ్యలో కొన్ని రోజులు భవన నిర్మాణ పనులకు వెళ్లేవాడన్నారు. ఒంటరిగానే బైక్, బస్సుల్లో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడేవాడు. తాళం వేసిన ఇళ్లను గుర్తించి వెనకాల తలుపులు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. సీసీ కెమెరాలు, జనసంచారం లేని ఇళ్లే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరిగాడు.

70కిపైగా చోరీలు

పోలీసులకు చిక్కిన నిందితుడు వెంకటేశ్ రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో 70కి పైగా కేసులు నమోదయ్యాయి. గోదావరిఖని వన్‌టౌన్‌లో 14, నస్పూర్‌లో 7, లక్సెట్టిపేట్‌లో 6, చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో 7, మందమర్రిలో 11, రామక్రిష్టాపూర్‌లో అత్యధికంగా 17, కాసిపేటలో రెండు, మంచిర్యాల శ్రీరాంపూర్‌లో ఒకటి, మంచిర్యాలలో ఐదు, భీమారంలో రెండు దొంగతనాలతో మొత్తం 72 చోరీలు చేసి రూ.1.20లక్షల విలువ చేసే 2.89కిలోల బంగారం, 4.07కిలోల వెండి, రూ.19లక్షల నగదు ఎత్తుకెళ్లాడు.

చివరకు చిక్కిందిలా..

గడిచిన నాలుగేళ్లుగా చోరీలకు పాల్పడిన వెంకటేశ్ గురువారం అనుమానస్పద స్థితిలో పోలీసులకు చిక్కాడు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వేలిముద్రలు సేకరించి ఫింగర్‌ప్రింట్ విభాగానికి పంపించారు. దీంతో 50కిపైగా చోరీల్లో ఇవే వేలిముద్రలున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో తమదైన శైలిలో విచారించడంతో చోరీలకు సంబంధించిన పూర్తివివరాలు వెల్లడించాడు.

పోలీసులకు దొరకని సొత్తు..

70కిపైగా ఇళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడిని పట్టుకున్నప్పటికీ సొత్తు మాత్రం దొరకలేదని సీపీ వెల్లడించారు. చోరీ సొత్తు ఆన్‌లైన్ గేమ్ దఫాబెట్ ఆడిపోగొట్టుకున్నాడని, కొంత బంగారం శ్రీరాం ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో ఆన్‌లైన్ గేమింగ్, జల్సాలకు వినియోగించాడని సీపీ వివరించారు. తిరిగి పోలీస్ కస్టడీకి తీసుకుని సొత్తంతా రికవరీ చేసేందుకు యత్నిస్తున్నామన్నారు.

పోలీసులకు సీపీ అభినందన

పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి నాలుగేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న వెంకటేశ్‌ను పట్టుకున్న మంచిర్యాల పోలీసులను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అభినందించారు. డీసీపీ సుధీర్‌కేకన్‌రామనాథ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్సై రవికుమార్, ఉదయ్‌కిరణ్, ఏఎస్సై జితేందర్‌సింగ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, తిరుపతి, రవిని అభినందించి నగదు రివార్డులు అందించారు.

భూ వివాదంలో ఇరువర్గాల వర్గాలపై కేసు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లిలో భూవివాదంలో ఇరువర్గాలు దాడులు చేసుకోగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపరు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆరేటి దేవయ్య మహమ్మద్ ఇబ్రహీం వద్ద ఐదు నెలల క్రితం ఇంటిని కొనుగోలు చేశాడు. ఇంటి పక్కన ఖాళీ ఉన్న స్థలం విషయంలో చాంద్‌మియా మనవడు హజీమ్, దేవయ్య మధ్య గొడవ జరిగింది. బుధవారం రాత్రి 10.30 గంటలకు జేసీబీతో ఆ స్థలంలో పనిచేసేందుకు హజీమ్ వెళ్లగా అక్కడే ఉన్నవారు అడ్డుకున్నారు. జేసీబీపై రాళ్లు విసరడంతో పాటు కర్రలతో దాడిచేయగా ఇరువర్గాలకు గాయాలయ్యాయి. గురువారం ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తహీనతతో బాలింత, శిశువు మృతి



సుమలత (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలోని అహ్మద్ హుస్సేన్‌పల్లి(మరిమడ్ల)కు రక్తహీనతకు గురైన ఓ బాలింతతోపాటు అప్పుడే పుట్టిన చిన్నారి మృతిచెందడం విషాదాన్ని నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని అహ్మద్‌హుస్సేన్‌పల్లి(మరిమడ్ల)కు చెందిన ఉల్లెందుల మధుకర్ -సుమలత దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. సుమలత ప్రస్తుతం 8 నెలల గర్భిణి. సుమలత కొన్ని నెలలుగా రక్తహీనతతో బాధపడుతోంది. ఇటీవల సిరిసిల్లలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆపరేషన్ చేసి మృత శిశువును బయటకు తీశారు. గురువారం సుమలత మృతిచెందింది. గర్భిణీగా ఉన్న సుమలత ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకున్నా వైద్యులు ఎందుకు గుర్తించలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి



మృతిచెందిన వంశీ

కోనరావుపేట : గుండెపోటుతో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన ఈర్ల సాయెబు- బాలవ్వ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురికి వివాహం జరిపించగా కుమారుడు వంశీ (22) డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. తల్లి బాలవ్వ పదినెలల క్రితమే అనా రోగ్యంతో మృతిచెందగా కొన్ని రోజులకు సంవత్సరీకం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం స్నేహితుడితో కలిసి వేములవాడకు వెళ్లి వచ్చాడు. ఛాతిలో నొప్పి రావడంతో మందులు వేసుకున్నాడు. మధ్యాహ్నం బాత్‌రూంకు వెళ్లిన వంశీ చాలాసేపు బయటకి రాలేదు. అనుమానం వచ్చిన తండ్రి సాయెబు చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకు సుధాకర్‌కు కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రవిగౌడ్



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సామాజిక వర్గానికి చెందిన చెరుకు సుధాకర్‌పై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ఖండించారు. తంగళ్లపల్లిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. చెరుకు సుధాకర్‌కు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాశ్, మండలాధ్యక్షుడు మట్టె నరేశ్, పట్టణాధ్యక్షుడు రుద్రవేని సుజిత్, నవీన్, రాజు, గణేశ్ పాల్గొన్నారు.



స్వామి వారల కల్యాణం జరుపుతున్న వేదమూర్తులు

కల్యాణం కమనీయం



మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడెంలోని ఆండాళ్ పద్మావతీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కనులపండువగా కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ చిట్నేని సరిత, ఎంపీటీసీ శ్రీధర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, చిట్నేని వెంకటేశ్వర్‌రావు, అంజన్‌రావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మల్లికార్జున కల్యాణం

ఎల్లారెడ్డిపేటలోని దొంతురాల మల్లికార్జున స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం సభ్యులు స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. పూజారులు పట్నం వేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి మొక్కులు చెల్లించుకున్నారు.